సాక్షి ప్రకాశం

మంగళవారం । 14 । జనవరి । 2025



గాలిపటం ఎగరేస్తుండగా విద్యుత్ షాక్

ఓ బాలుడు గాలిపటం ఎగరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలయ్యాడు. - 8లో..



యువతి ఆత్మహత్య

ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన దర్శి మండలం మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30/23

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలందరూ భోగభాగ్యాలు, సిరి సంపదలతో సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆకాంక్షించారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యేలు గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవి బాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలైన కల్చరల్ వింగ్ అధ్యక్షులుగా పొన్న వెంకట లక్ష్మి, ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షునిగా అంగిరేకుల ఆదినారాయణలను నియమించారు. వారితో పాటు మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పత్తి రవిచంద్రను పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శిగా నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

- విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం డిమాండ్



గాంధీనగర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. సోమవారం ఉదయం జిల్లా గాంధీనగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేసిన సీపీఎం నాయకులు విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ...విద్యుత్ చార్జీలను పెంచేదే లేదంటూ ఎన్నికలకు ముందు ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ట్రూ అప్ చార్జీల పేరుతో దొడ్డి దారిన విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై విపరీతమైన భారం వేయడం దుర్మార్గం అన్నారు. ట్రూ అప్ చార్జీల రూపంలో రాష్ట్ర ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం వేయాలన్న నిర్ణయాన్ని వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి అదనంగా డబ్బులు వసూలు చేసే కుయుక్తులను మానుకోవాలని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే చార్జీలను పెంచమని చెప్పిన మాట ఇప్పుడు గుర్తుకురావడం లేదా చంద్రబాబు అంటూ ప్రశ్నించారు. కార్పొరేట్లకు కోట్లు దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రస్తుతం వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఆ తరువాత నివాస గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారని చెప్పారు. నివాస గృహాలకు బిగించే స్మార్ట్ మీటర్ల ఖర్చు రూ.15 వేలు వినియోగదారుల నుంచే వసూలు చేస్తారని, ప్రజలు ఇప్పుడే మేలుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాలం సుబ్బారావు, తంబి శ్రీనివాసరావు, సయ్యద్ హుసేన్, దామా శ్రీనివాసులు, షేక్ పీరు, కె.విశ్వసేన, రామకృష్ణ, శ్రీధర్‌రావు, టీవీఆర్ సుబ్బారావు, పోలయ్య, కస్తూరి, సురేష్, దాసు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దిబ్బల రోడ్డులో కరెంటు బిల్లులు దహనం...

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీల దోపిడీని ఉపసంహరించుకోవాలని కోరుతూ నగరంలోని దిబ్బల రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కరెంటు నష్టాలను ప్రభుత్వమే భరించాలని, అదనపు చార్జీల వసూలును నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఎప్పుడో వాడిన వాటికి ఇప్పుడు ప్రజలపై వేయడం దుర్మార్గమని జిల్లా నాయకుడు కంకణాల ఆంజనేయులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమాదేవి, జి.ఆదిలక్ష్మి, ఏ.లక్ష్మీ నారాయణ, ఎం. శ్రీనివాసులు, జి.కళ్యాణి, టి.వీరయ్య, పాపని సుబ్బారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



మమతల లోగిళ్లు.. సంక్రాంతి సందళ్లు

తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒంగోలు నగరంలో సందడి నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన బంధుమిత్రులతో ఇళ్లు మమతల లోగిళ్లయ్యాయి. నగరంలో సోమవారం పలు విద్యా సంస్థలు, వాసవీ క్లబ్, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో భోగిమంటలు, గంగిరెద్దులాటలు ఆకట్టుకున్నాయి. పిల్లలకు భోగిపళ్లు పోసి..బొమ్మల కొలువులతో సందడి చేశారు. పలుచోట్ల ఎడ్లపందేలు, పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. నేడు సంక్రాంతి వేడుకలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పలుచోట్ల తెప్పోత్సవాలు, పార్వేట ఉత్సవాలు నిర్వహించనున్నారు.

- సాక్షి, ఒంగోలు

"నా పందెం ..రూ.10 వేలు.. రూ.50 వేలు.. రూ.లక్ష.." ఇలా బెట్టింగ్‌లతో పందెంరాయుళ్లు రెచ్చిపోతున్నారు. నిబంధనలతో సంబంధంలేదు.. మాకు నచ్చినట్లు చేసుకుంటాం..అధికార కూటమి పార్టీ నేతల అండదండలతో అంతా మా ఇష్టం అంటూ కోడిపందేల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. జిల్లా అంతటా అనధికారికంగా బరులు ఏర్పాటు చేసుకుని కత్తుల కోళ్లతో పందేలు నిర్వహిస్తున్నారు. రూ.లక్షలు చేతులు మారుతున్నా ప్రభుత్వ పెద్దల దగ్గర నుంచి ఒత్తిడి ఉండదంతో పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



కూటమి బరులు.. కత్తుల కోళ్లు..

- జిల్లాలో జోరుగా కోడి పందేలు
- అధికార పార్టీల నాయకుల కనుసన్నల్లో దందా
- నూతలపాడులో బహిరంగంగా పందేలు
- మనోళ్లే అంటూ మంత్రి హుకుంతో చోద్యం చూసిన పోలీసులు
- సింగరాయకొండ మండలంలో రూటు మార్చిన పందెంరాయుళ్లు
- పాతపాడుకు తరలివెళ్లిన కొత్తపట్నం, ఒంగోలు ప్రజలు
- యర్రగొండపాలెంలో రహస్యంగా కోతాట

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

లేదు లేదంటూనే జిల్లాలో జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయి. ఆమూల నుంచి ఈ మూల వరకు జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో కూటమి నేతల కనుసన్నల్లో దందా జోరుగా సాగుతోంది. తగ్గేదేలేదంటూ పచ్చదండు కోళ్లను బరిలోకి దింపి కేక పుట్టించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక మంత్రి కనుసైగలతో సంతనూతలపాడు మండలంలోనూ బహిరంగంగానే బరుల్లో కత్తుల కోళ్లతో పందెంరాయుళ్లు రెచ్చిపోయారు. ఇక ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రహస్యంగా కోతాట నిర్వహించారు.

దారులన్నీ గుండాయపాలెం వైపే..

ఒంగోలు మండలంలోని పాతపాడులో జరిగే కోడి పందేలను ఈసారి గుండాయపాలేనికి మార్చారు. ఈ గ్రామానికి దారి సక్రమంగా ఉండదు. సముద్రం తీర ప్రాంతానికి చెందిన ఈ గ్రామానికి రావాలంటే కాలువలు ఎక్కువగా ఉంటాయి. రోడ్డు వసతి లేకపోవడంతో అధికారులు ఇక్కడకు రారు. దీంతో ఈ గ్రామాన్ని పందెం రాయుళ్లు ఒక డెన్‌గా తయారు చేసుకున్నట్లు సమాచారం. పాతపాడు కోడి పందేలకు క్రేజ్ కూడా ఉండడంతో ఒంగోలు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పందెంరాయుళ్లు అక్కడకు చేరినట్టు తెలిసింది. ఇక్కడ సోమవారం ఒక్క రోజే లక్షల రూపాయలు చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం.

రూటు మార్చిన పందెంరాయుళ్లు...

జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సొంత నియోజకవర్గంలో విచ్చలవిడిగా కోడి పందేలు జరిగాయి. అయితే ఎప్పుడూ నిర్వహించే ప్రాంతాలు కాకుండా పందెం రాయుళ్లు రూటు మార్చారు.

కొండపిలో మండలంలోని చినకండ్లగుంట, అనకర్లపూడి, చౌడవరం, పెట్లూరు గ్రామాల్లో పొన్నలూరు మండలంలోని మూలపాడు, పిన్నిపాడు, తిమ్మపాలెం, బాలిరెడ్డిపాలెంలలో, టంగుటూరు మండలంలోని కారుమంచి, కొణిజేడు, మర్రిపూడి మండలంలోని మర్రిపూడి, శివనారాయునిపేట, గార్లపేట, కాకర్ల, వేమవరం, అయ్యరాజుపాలెం, జక్కురాజుపాలెం, నరసరాజు పాలెం గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహించినట్లు తెలుస్తోంది. జరుగుమల్లి మండలంలోని ఎడ్లూరిపాడు, సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి, పాకల, శానంపూడి, కనుమర్ల గ్రామాల్లో పందెం కోళ్లు పోటీపడ్డాయి. కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు గ్రామాల్లో ప్రచారం అయితే చేశారు కానీ చేతల్లో మాత్రం మిన్నకుండిపోయారు. గతంలో ఊళ్లపాలెం, పాకల గ్రామాల్లో జోరుగా కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఊళ్లపాలెం రోడ్డులోని జగనన్న కాలనీ వెనకవైపున ఉన్న పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని మట్టిదిబ్బలు, గ్రావెల్ దిబ్బలను అడ్డాగా చేసుకొని పందేలు నిర్వహించినట్లు సమాచారం. ఈ విషయం తెలిసి కూడా అధికార పార్టీతో పెట్టుకుంటే తలనొప్పులు వస్తాయన్న భయంతో పోలీసులు అటు వైపు తొంగిచూసే సాహసం చేయలేక పోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోడి పందేలకు అడ్డా... కొత్తపట్నం...

ఈ సోమవారం కొత్తపట్నం మండలానికి కోడి పందేలతో తెలవారింది. విపరీతంగా మంచు కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా తెలవారుజాము నుంచే కోడి పందేలను మొదలు పెట్టారు. మండలంలోని మడనూరు, ఈతముక్కలపాడు గ్రామాల సరిహద్దుల్లోని తోటల్లో తమ్ముళ్లు కోడి పందేలు నిర్వహించారు. కార్లలో సైతం తరలివచ్చిన పందెం రాయుళ్లు లక్షల రూపాయలు పందెం కాసినట్లు తెలుస్తోంది. గమళ్లపాలెం గ్రామం సరిహద్దుల్లో కూడా జోరుగా పందేలు జరిగినట్లు సమాచారం.

గుట్టుగా నిర్వహణ ఏర్పాట్లు

మార్కాపురం నియోజకవర్గంలోని పలు శివారు గ్రామాల్లో గుట్టుగా కోడిపందేలు, పేకాట శిబిరాలు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని పెద్దారికట్ల, సలకనూతల గ్రామాలకు సమీపంలోని కొండల్లో గుట్టుగా కోడిపందేలు నిర్వహించగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. మార్కాపురం పట్టణ శివార్లతోపాటు బొడిచర్ల, తిప్పాయిపాలెం, చింతగుంట్ల, రాయవరం, తర్లుపాడు మండలంలోని నాగేళ్లముడుపు, తాడివారిపల్లి, కలుజువ్వలపాడు, పోతలపాడు తదితర గ్రామాల్లో పోలీసుల కళ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. అయితే వారు రూటు మార్చి వేరే ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు సమాచారం.

మంత్రి అనుమతులతో బరితెగింపు...

సంతనూతలపాడు మండలంలోని వడ్డెపాలెం గ్రామ పరిసరాల్లో ఈసారి కోడి పందేలు యమజోరుగా సాగాయి. తెలవారుజాము నుంచే కోళ్లను రంగంలోకి దింపిన తమ్ముళ్లు కాలుదువ్వి పోటీలకు సై చెప్పారు. స్థానిక టీడీపీ నాయకులు నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ఆశీస్సులు ఉన్నట్టు సమాచారం. మంత్రి అభయంతో పందెం రాయుళ్లు బరితెగించారు. మనోళ్లే అటువైపు చూడొద్దంటూ సదరు మంత్రి పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. దీంతో పోలీసులు అటువైపు వెళ్లే సాహసం చేయలేదు. సోమవారం రూ.లక్షలు చేతులు మారగా, మంగళవారం కూడా ఇక్కడ కోడి పందేలు నిర్వహించనున్నట్లు తెలుగు తమ్ముళ్లు బహిరంగంగా ప్రకటించడం గమనార్హం.

సెల్‌ఫోన్లు లాక్కొని...

యర్రగొండపాలెంలో రహస్యంగా కోతాట ఆడినట్లు ప్రచారం జరుగుతుంది. గ్రామంలోని పుల్లలచెరువు రోడ్డు, కొలుకుల రోడ్డుతో పాటుగా మండలంలోని వీరభద్రాపురం, నడిగడ్డ, కొలుకుల, త్రిపురాంతకం మండలంలోని ఒక జామాయిల్ తోటలో పేకాట శిబిరం ఏర్పాటు చేసినట్టు సమాచారం. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన టీడీపీ నాయకులు త్రిపురాంతకంలో పేకాట నిర్వహిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు. పేకాటరాయుళ్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు తీసుకొని రహస్య ప్రాంతాల్లో పేకాటాడిస్తున్నట్లు సమాచారం. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సెల్‌టవర్ ఎక్కిన లారీడ్రైవర్

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఈద్గమిట్ట ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ పఠాన్‌ఖాన్ కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. సోమవారం చందమామ రెస్టారెంట్ సమీపంలోని సెల్ టవర్ ఎక్కి సుమారు అరగంట సేపు హడావుడి చేశాడు. స్థానికులు ఎంత బతిమలాడినా అతను కిందకి దిగటానికి ససేమిరా అన్నాడు. చివరకు ఎస్సై బి మహేంద్ర తన సిబ్బందితో అక్కడికి చేరుకుని పఠాన్‌ఖాన్‌కు సర్దిచెప్పటంతో అతను సెల్ టవర్ దిగటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



సెల్‌టవర్ ఎక్కిన మతి స్థిమితం లేని లారీ డ్రైవర్

బాబు పాలన అంతా బూటకమే



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: సీఎం చంద్రబాబు పాలన అంతా బూటకమని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు రెవెన్యూ సదస్సుల పేరిట అధికారులను గ్రామాల్లో తిప్పుతూ నెల రోజులుగా పార్టీ ప్రచారం కోసం రెవెన్యూ యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వంలో 2014–2019 సంవత్సరాల మధ్య చంద్రబాబు చేతకానితనం వల్ల ఈనామ్ భూములు, చుక్కల భూములని, 22ఏ కింద చేర్చి జనాన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టారన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కలెక్టర్లకు అధికారాలు ఇచ్చి, జీవోలు జారీ చేసి పరిపాలనను సులభతరం చేయటం కోసం చట్టాన్ని తెచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. ముంగమూరు లో సర్వే నంబరు 14 లో ఎకరం భూమి దేవదాయశాఖ భూమి అని ఉందని, దాని కోసం మిగిలిన 50 ఎకరాలను బ్లాక్ చేశారని తెలిపారు. 50 ఎకరాల రైతులు రిలీజ్ చేయించుకోవడం కోసం దేవదాయశాఖ చుట్టూ తిరిగినా ఉపయోగం లేదని, కమిషనర్ దగ్గరకు, లేదా ప్రభుత్వ దగ్గరకు పోయి రిలీజ్ చేయించుకోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సమస్యలు సృష్టిస్తే పది రూపాయలు వస్తాయని వినియోగదారులను పీక్కుతింటూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే చట్టంతో రైతులందరి సమస్యలను పరిష్కరించేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. సర్వేనంబర్ల తేడా, చిన్న చిన్న సమస్యలు పరిష్కరించడానికి చట్టాన్ని తెచ్చారని, ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో సర్వే జరిగిందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించి పారదర్శకంగా అమలు చేస్తుంటే దానికి అడ్డం పెట్టారని, సమర్థవంతమైన చట్టం తెస్తే దానిని రద్దు చేశారన్నారు. ముక్తినూతలపాడులో సర్వే నంబరు 242/1ఏ లో ల్యాండ్ కన్వర్షన్ కోసం రూ.15 లక్షలు కట్టారని, ఎమ్మార్వో చుట్టూ తిరిగినా ఉపయోగం లేదని, ప్రభుత్వానికి డబ్బులు కట్టి మీ చుట్టూ తిరగాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నమిట్టలో సర్వే నెంబరు 5 లో ఎమ్మార్వో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ తప్పు చేస్తే జేసీ కి ఫైల్ పెడితే కిందికి, పైకి ఆరు నెలలు నుంచి తిప్పుతున్నారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో తహశీల్దార్లు సమస్యలు పరిష్కరించకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ క్యాలెండర్ లకు మాత్రమే పరిమితం అయిందని, ఈ సారి గ్రామాల్లో పండుగ కళ తప్పిందన్నారు. గత ప్రభుత్వంలో వ్యవసాయాన్ని పండుగ చేసి గిట్టుబాటు ధరలు కల్పించారన్నారు. రైతులకు అన్ని రకాల సేవలు అందించి వారి అభివృద్ధికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, నగర కన్వీనర్ రాంబాబు, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులో బాలికల బొమ్మల కొలువు


ఒంగోలులో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు


ఒంగోలు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు

అబ్బురం.. భోగి సంబరం

ఊరూవాడా సంక్రాంతి సందడి షురూ అయింది. సోమవారం సూర్యోదయానికి ముందే వీధివీధినా భోగి మంటలు వేశారు. మహిళలు గుమ్మం ఎదుట రంగవల్లులు, గొబ్బెమ్మలు తీర్చిదిద్ది సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని దీవెనలందించారు. క్రీడలు, ముగ్గులు, పతంగుల పోటీల్లో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒంగోలు నగరంతోపాటు పట్టణ ప్రాంతాల్లో సామూహిక భోగి సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. భోగి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

- సాక్షి నెట్‌వర్క్


అరిసెలు వండుతున్న మహిళలు


పిండి వంటలు కొనుగోలు చేస్తున్న జనం


పామూరులో వాసవీమాత ఆలయం వద్ద భోగి మంటలు వేస్తున్న ఆర్యవైశ్యులు


ఒంగోలు సమీపంలో ఎడ్లబండిపై యువతుల సందడి


ఒంగోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో కాంతారా నృత్యం


సంతనూతలపాడులో జెండా చెట్టు వద్ద ముగ్గుల పోటీ


భోగి మంటల వెలుగులో కొండపిలోని ఓ వీధి

గాలిపటం ఎగురవేస్తుండగా విద్యుత్ షాక్

- బాలుడికి తీవ్రగాయాలు
- మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలింపు


విద్యుత్ షాక్‌కు గురై గాయపడిన అవీష్

ఒంగోలు టౌన్: ఓ బాలుడు గాలిపటం ఎగురవేస్తుండగా విద్యుత్ తీగలకు చిక్కుకుంది. దాన్ని తీసేందుకు ప్రయత్నిస్తూ ఆ బాలుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలపాలవడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై తరలించారు. ఆ వివరాల ప్రకారం.. ఒంగోలు నగరపాలక సంస్థలోని పేర్నమిట్టలో శాంతినగర్‌కు చెందిన రాతికింది రవికుమార్, మల్లేశ్వరి దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు రాతికింది అవీష్ (10) సోమవారం ఉదయం ఇంటి వద్ద గాలిపటం ఎగురవేస్తున్నాడు. ఇంటి సమీపంలోనే ఒక చిన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గాలిపటం ట్రాన్స్‌ఫార్మర్ తీగల్లో చిక్కుకుపోయింది. దాంతో ఆ బాలుడు మేడ ఎక్కి కరెంటు తీగల మధ్య చిక్కుకున్న గాలిపటాన్ని తీసేందుకు ప్రయత్నించి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో బాలుడికి చేతి వేళ్లు పూర్తిగా, కాలి బొటనవేళ్లు పూర్తిగా కాలిపోయాయి. వీపు భాగంలో కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నై తరలించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం...

పేర్నమిట్ట శాంతినగర్‌లో నివాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉందని, తొలగించాలని స్థానికులు ఎప్పటి నుంచో విద్యుత్ అధికారులను కోరుతున్నారు. అయినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యం కారణంగానే అవీష్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ కక్షతో దేవాలయంలోకి అనుమతించడం లేదు

- పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించిన గ్రామసర్పంచ్
- పూజలు చేసుకునేందుకు అనుమతించిన హైకోర్టు
- హైకోర్టు అనుమతి పత్రం చూపించినా స్పందించని పోలీసు అధికారులు
- వైఎస్సార్ సీపీకి చెందిన అల్లినగరం మహిళా సర్పంచ్‌కి చేదు అనుభవం

కొమరోలు: రాజకీయ కక్ష సాధింపులతో తనను, కుటుంబ సభ్యులను తమ గ్రామంలోని పట్టాభి రామస్వామి దేవాలయంలోకి అనుమతించడం లేదని ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలైన సర్పంచ్ బంగారు రత్నాలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పూర్వం నుంచి పట్టాభిరామస్వామి దేవాలయంలో సంక్రాంతి (కనుమ) పండుగ సందర్భంగా పారువేట కార్యక్రమాన్ని నిర్వహించేవారని, ఆ కార్యక్రమానికి తమ కుటుంబ సభ్యులతో వెళ్లి దేవాలయంలో పూజలు చేసే వారమని తెలిపారు. ఈ సంక్రాంతి పర్వదినం సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి వెళ్లాలనుకుంటే కొంత మంది గ్రామ పెత్తందారులు తమను అనుమతించడం లేదని చెప్పారు. గ్రామానికి చెందిన టీడీపీ వర్గానికి చెందిన అక్కి పుల్లారెడ్డి, అక్కి వెంకటేశ్వరరెడ్డి, కడియం వెంకటసుబ్బయ్య, కోటా స్వామికొండయ్య, నక్కా శ్రీనివాసులు, నక్కా బ్రహ్మం, సాను సుబ్బయ్య, అక్కి సీతారామిరెడ్డిలు తనను, తన కుటుంబ సభ్యులను దేవాలయానికి వస్తే కొట్టి చంపివేస్తామని బెదిరిస్తున్నట్లుగా ఆరోపించారు. ఈ బెదిరింపులతో తాను, తన కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. గతంలో అల్లినగరం మాజీ ఎంపీటీసీ పుల్లా కేశవరాయుడు కూడా ఈ పండుగ విషయంలో కొట్టి చంపడానికి ప్రయత్నించారని, కొమరోలు పోలీసుస్టేషన్‌లో కూడా క్రిమినల్ కేసు నమోదైనట్లుగా తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా తాము కుటుంబ సభ్యులతో దేవాలయానికి వస్తే పండుగ జరుగనివ్వమని గ్రామస్తులతో చెప్పి ఉత్సవాలు చేయలేదు. గత సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ విషయంపై రిజిస్టర్ పోస్టు ద్వారా కొమరోలు ఎస్సై, కలెక్టర్, ఎస్పీ, హ్యూమన్ రైట్స్‌కు ఫిర్యాదును పంపించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఎవరూ స్పందించకపోవడంతో ప్రస్తుతం హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. హైకోర్టు వారు తమను పట్టాభిరామస్వామి దేవస్థానంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేలా, ఆ సమయంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ ఉత్తర్వుల కాపీని తీసుకుని పోలీసు అధికారుల దగ్గరకు వెళ్లినా సరిగా స్పందించడం లేదని, గ్రామపెత్తందారులకు వత్తాసు పలుకుతున్నట్లుగా ఆరోపించారు. తమను దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని హైకోర్టు ఆర్డర్ కాపీ ఇచ్చారని, దేవాలయంలో 100 మంది తరువాత అయినా పూజలు నిర్వహించుకుంటామని, కొబ్బరికాయ కొట్టుకుంటామని పోలీసు వారికి తెలిపినా స్పందించడం లేదని తెలిపారు. దేవాలయంలో అందరూ సమానమేనని, టీడీపీ ప్రభుత్వంలో రాజకీయ కక్ష సాధింపులతో దేవాలయంలోకి రానివ్వకపోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసి అల్లినగరం గ్రామంలో సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చూడాలని గ్రామసర్పంచ్ బంగారు రత్నాలు తెలిపారు.


అల్లినగరం గ్రామ సర్పంచ్ బంగారు రత్నాలు

యువతి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రాంబాబు

దర్శి: ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దర్శి మండలంలోని మారెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన హనుమంతరావుకు కొండా మౌనిక (24)తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమార్తె, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. భర్త కూలి పనులు చేసి సంపాదించిన దాంట్లో తన తల్లిదండ్రులకు కొంత ఇస్తుంటాడు. ఈ విషయంపై హనుమంతరావు, మౌనికల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి హనుమంతరావు తన అత్తకు ఫోన్ చేసి మీ అమ్మాయి నన్ను బాగా ఇబ్బంది పెడుతుందని చెప్పాడు. నేను వచ్చి మాట్లాడతానని ఆమె చెప్పింది. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మౌనిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలడిగి తెలుసుకున్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- పాత కక్షల నేపథ్యంలోనే అంటున్న పోలీసులు
- కోడి పందేలే కారణమంటున్న స్థానికులు

సింగరాయకొండ: స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఆదివారం రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. స్థానికుల కథనం మేరకు.. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో దాదాపు 15 నిమిషాలపాటు ఇరువర్గాల పరస్పర దాడులతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. ఘర్షణ పడుతున్న వారిని వారించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని లక్ష్మీనారాయణ, నాని అనే వ్యక్తులను మరోవర్గం వారు దారుణంగా కొట్టారని స్థానికులు చెప్పారు. కోడి పందెం దగ్గర ఈ గొడవ ప్రారంభమైందని స్థానికులు పేర్కొనగా, పాత కక్షలే కారణమని తన దర్యాప్తులో తేలిందని ఎస్సై మహేంద్ర చెప్పారు. కాగా, తనపై దాడి చేశారంటూ బింగినపల్లికి చెందిన మాదాల రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమరాజుపల్లి గ్రామానికి చెందిన నూకసాని లక్ష్మీనారాయణ, నాని, సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూ ఆక్రమణపై స్పందించిన అధికారులు

- ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట రెవెన్యూ పరిధిలో 392/2, 393 సర్వే నంబర్లలో వాగు పోరంబోకు భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమించిన వారు శిక్షార్హులని తెలియజేస్తూ సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అక్కడున్న 11.40 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించి చదునుచేయించడానికి చూస్తున్న నేపథ్యంలో 'రూ.కోట్ల భూమిని కాజేశారు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఈ నెల 9వ తేదీ కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.


రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేయించిన హెచ్చరిక బోర్డు

స్థానిక ఎన్నికల బ్యాలెట్ బాక్సులు చోరీ

ఒంగోలు టౌన్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరం పక్కన ఒక గదిలో భద్రపరిచిన స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. కొద్ది రోజుల క్రితం ఆ గది వెనక భాగంలో గోడకు చిన్న రంధ్రం పడింది. అందులో నుంచి బ్యాలెట్ బాక్సులు బయటకు కనిపిస్తుండటం, సరైన సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడంతో దుండగులు కన్నేశారు. ఆదివారం తెల్లవారుజామున ఎనిమిది బాక్సులను అపహరించారు. అప్పటికీ సెక్యూరిటీ ఎవరూ చూడకపోవడంతో దుండగులు మరోమారు చోరీకి యత్నించారు. ఈ సమయంలో సిబ్బంది గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. ఆ ప్రాంతంలో పాత ఇనుము ఏరుకునే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవ సంబంధాలు పెంపొందించే సంక్రాంతి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పాత ఆలోచనలు వదిలి, సరికొత్త ఆశలకు ప్రతీకగా నిలిచేది సంక్రాంతి అని, మానవ సంబంధాలను పెంపొందించే ఈ పండగను జిల్లా ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకాంక్షించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కోడి పందేలు, పేకాట లాంటి జూద శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని, సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.


కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేస్తున్న ఎస్పీ దామోదర్